

పోస్టర్ల వివాదంలో ముగ్గురిపై బైండోవర్ కేసు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట శాసనసభ్యులు మేడా వెంకట మల్లికార్జునరెడ్డికి వ్యతిరేకంగా మంగళవారం పట్టణంలో వెలసిన పోస్టర్ల వివాదంలో పోలీసులు ముగ్గురిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. పదవ వార్డు కౌన్సిలర్ సూరి, వర్తిబోయిన బాబు, బిల్లా నరేష్‌పై బైండోవర్ నమోదు కాగా సినిమా పోస్టర్లు అంటించే మస్తాన్‌కు చెందిన పోలిచర్ల కుమార్ అనే వ్యక్తులను మంగళవారం రాత్రే అదుపులోకి తీసుకొని పోలీసులు విచారించినట్లు సమాచారం. మా నమ్మకం నువ్వే జగనన్న, కానీ రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి.. మీ మీద మాకు నమ్మకం లేదు, ఇట్లు మోసపోయిన వైసిపి నాయకులు, కార్యకర్తలు అని సంబోధిస్తూ మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాలలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు గోడలకు పోస్టర్లు అంటించిన విషయం విధితమే. వైసిపి నాయకులలో చిలికి చిలికి గాలి వానలా ఈ వివాదం ఎటువైపు దారితీస్తుందో వేచి చూడాలి.

'ఉక్కు' సంకల్పమేదీ?

రాయలసీమ అనాదిగా వెనుకబడి ఉంది. పాలకులు ఎవరూ సీమ అభివృద్ధి గురించి పట్టించుకున్నపాపాన పోలేదు. ఏ ప్రాంతమైనా అభివృద్ధి జరగాలంటే వ్యవసాయంతోపాటు పరిశ్రమలు ఎంతో ముఖ్యం. వ్యవసాయం కాస్తా మూలనపడిపోయింది. పరిశ్రమలైనా వస్తాయనుకుంటే అవి కూడా ఆమడదూరంలో ఉంటున్నాయి. సీమ ప్రజల ఆకాంక్ష అయిన ఉక్కు పరిశ్రమతోనైనా ఈ ప్రాంతం అభివృద్ధి చెందడంతో పాటు నిరుద్యోగ సమస్య తీరుతుందని భావించారు. ఎలాంటి ఉద్యమాలు లేకుండానే మనకు బ్రాహ్మణి రూపంలో ఒక ఉక్కు పరిశ్రమ వచ్చింది. ఎంత వేగంగా వచ్చిందో అంతే వేగంగా రద్దయిపోయింది. చంద్రబాబు, జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు సార్లు శంకుస్థాపనలు చేశారు. ప్రస్తుతం వాటి ఊసే లేదు. ఉద్యమాల పుట్టినిల్లుగా పేరుపొందిన విశాఖపట్నం ఉక్కు పరిశ్రమ స్థాపనకు చేసినట్లుగా కడప ఉక్కు కోసం పోరాటాలు సాగించాలి. 'కడప ఉక్కు-రాయలసీమ హక్కు' అని ముక్తకంఠంతో నినదించాలి. ఢిల్లీ పాలకుల వెన్నులో వణుకు పుట్టించాలి. వారి మెడలు వంచి తాము కోరుకున్నది సాధించకోవాలి. భవి ష్యత్తరాల కోసం ఈ ప్రతిష్టాత్మక పరిశ్రమకు రూపకర్తలుగా మారాలి. ఉక్కు పరిశ్రమ స్థాప నకు రాయలసీమ ప్రజాప్రతినిధులు అందరూ ఏకం కావాల్సిన అవరం ఎంతైనా ఉంది.



- విభజన హామీకి తూట్లు
- 'సెయిల్' ఏర్పాటుకు కేంద్రం విముఖత
- ప్రభుత్వ రంగంలో చేపట్టడంపై నిర్లక్ష్యం
- ఉపాధి కోసం నిరుద్యోగుల ఎదురుచూపులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

విభజనతో గాయపడిన ఆంధ్రప్రదేశ్ దారుణంగా మోసపోయింది. పదేళ్లుగా ప్రత్యేక హోదా దక్కుతుందన్న ఆశతో ఎదురుచూసిన ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం మొండిచెయ్యే చూపింది. రాయలసీమలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు విభజన చట్టంలో హామీ ఇచ్చారు. రాయలసీమలో కరువు ఎక్కువగా ఉంది. భూమి, ఖనిజ నిల్వలు విస్తారంగా ఉన్నాయి. ఉక్కు పరిశ్రమ స్థాపనకు అనుకూలమని శ్రీకృష్ణ కమిటీ తమ నివేదికలో పేర్కొంది. సెయిల్ బృందం కూడా జిల్లాలో పర్యటించింది. ముడి ఖనిజాల లభ్యత, ఇనుము, డోలమైట్, పరిశ్రమ ఏర్పాటుకు స్థలం, నీరు, ట్రాన్స్‌పోర్టు తదితర అంశాలను పరిశీలించింది. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం కమిటీల మీద కమిటీలు వేసి చివరికి టాస్క్‌ఫోర్స్ కమిటీ పేరుతో ఎనిమిదేళ్లు కాలయాపన చేస్తోంది. ఎనిమిది బడ్జెట్‌లోనూ రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న ఉక్కు పరిశ్రమ ఏర్పాటు హామీకి కాలదోషం పట్టించింది. విభజన చట్టం-2014లోని షెడ్యూల్-13లో కడప సమీకృత ఉక్కు పరిశ్రమను ప్రత్యేకంగా ప్రస్తావించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆ ఊసేలేదు.

ఖనిజాలకు ఖిల్లా.. పరిశ్రమలేవి?

కడప బేసిన్‌లో అరుదైన ఖనిజ నిక్షేపాలు ఉన్నాయి. కడపకు ఖనిజ నిక్షేపాల ఖిల్లాగా పేరుంది. ఉక్కుతో పాటు ఇతర పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా లభిస్తాయి. ఎన్ని తరాలు తవ్వినా తరగని సున్నపురాయి గనులు ఉన్నాయి. ప్రపంచంలోనే అత్యతధిక విస్తీరణంతో పాటు అరుదైన బెరైటీస్ మంగంపేటలో నిక్షేపమై ఉంది. బంగారం కంటే 50 రెట్లు విలువ చేసే పుల్లరిన్ ఉంది. ఇంకా ఎన్నోరకాల ఖనిజ నిక్షేపాలు జిల్లాలో విస్తారంగా ఉన్నాయి. వేలాది ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉంది. పరిశ్రమల స్థాపనకు అవసరమైన వనరులు మెండుగా ఉన్నాయి. ఇన్ని వనరులున్నా జిల్లాలో పరిశ్రమలు లేకపోవడంతో నిరుద్యోగులు ఉపాధిలేక ఇక్కడి నుంచి వేలాది మంది గల్ఫ్ దేశాలకు వలస వెళుతున్న దౌర్భాగ్యపు పరిస్థితి నెలకొంది.

వేగంగా వచ్చింది...అలాగే రద్దయింది

ఎలాంటి ఉద్యమాలు లేకుండానే మనకు బ్రహ్మణి రూపంలో ఒక ఉక్కు పరిశ్రమకు అనుమతి వచ్చింది. జిల్లాలో ఉక్కు పరిశ్రమకు అనుమతించడం వరం లాంటిదని అందరూ భావించారు. జిల్లాకు ఉక్కు కర్మాగారం వస్తుందని ఎవరూ ఊహించలేదు. పరిశ్రమకు అవసరమైన భూములు, నీరు, ఇతర రాయితీలు చకచకా జరిగిపోయాయి. బళ్లారికి చెందిన ప్రారిశ్రామిక వేత్త గాలి జనా ర్థన్‌రెడ్డి ఇక్కడ పరిశ్రమ స్థాపనకు ముందుకు వచ్చారు. పద్దెనిమిది నెలల్లో 4,500 కోట్లతో రెండు మిలియన్ టన్నుల ఉత్పిత్తి సామర్థ్యంతో బ్రహ్మణి ఉక్కు పరిశ్రమను పూర్తి చేసి పది వేల మందికి ఉపాధి కల్పిస్తామని 2007 జూన్ పదవ తేదీన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేశారు. ఓఎంసి అక్రమాల కేసులో గాలి జైలుకెళ్లడంతో శాశ్వతంగా ఉక్కు పరిశ్రమకు తెరపడింది. ఎంత త్వరగా వచ్చిందో అంతే వేగంగా రద్దయిన విషయం తెలిసిందే.



ఉక్కు పరిశ్రమ జిల్లాలోనే ఎందుకు?

కడప జిల్లా ఆర్థికంగా, పారిశ్రామికంగా బాగా వెనుకబడిన ప్రాంతం. ఆంధ్రప్రదేశ్ విభజన ఉద్యమాల సందర్భంగా నియమించిన శ్రీ కృష్ణ కమిషన్ ప్రముఖంగా ప్రస్తావించిన ఒక అంశం రాయలసీమ వెనుకబాటు తనం గురించి. తెలంగాణ కంటే రాయ లసీమ అన్ని అభివృద్ధి సూచికల్లో వెనుకబడి ఉండటం శ్రీ కృష్ణ కమిషన్ తేల్చింది. అంత వెనుకబడిన ప్రాంతంలో నడిబొడ్డున ఉన్నది కడప జిల్లా నెల్లూరు, ప్రకా శంలతో కూడిన ఆరు జిల్లాలకు మధ్యన ఉంది. వెను కబాటుతనం పోవాలన్నా, ఉపాధి లభించాలన్నా, తద్వారా అభివృద్ధి జరగాలన్నా కావాల్సింది పరిశ్రమల స్థాపన. అందు కోసమే ఉక్కు పరిశ్రమ కావాలి. ముఖ్యంగా జిల్లాలో 500 మంది పనిచేసే ఒక్క పరిశ్రమ కూడాలేదు. జిల్లాకు వరం లాంటి ఉక్కు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వమే ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. మళ్లీ ఇక్కడ ప్రభుత్వ రంగంలోనే పరిశ్రమను స్థాపించాలనే ఉద్దేశం కూడా లేన ట్లుగా ఉంది. ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తే జిల్లాలో నేరుగా పది వేల మందికి పరోక్షంగా లక్షన్నర మందికి ఉపాధి లభిస్తుంది.

శంకుస్థాపనలపై శంకుస్థాపనలు

జిల్లాలో ఉక్కు పరిశ్రమ స్థాపనలకు పాలకులు శంకుస్థాపనలపై శంకుస్థాపనలు చేసూకుంటూ పోతున్నారు. పరిశ్రమ నిర్మాణ పనులు మాత్రం కనీసం మచ్చుకు కూడా కనిపించడం లేదు. 2007 జూన్ 10న జమ్మలమడుగు మండల పరిధిలోని అంబవరం వద్ద బ్రాహ్మణి స్టీల్‌ప్లాంట్‌కు డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి, 2018 డిసెంబర్ 27న జమ్మలమడుగు నియోజకవర్గ పరిధిలోని మైలవరం మండలం కంబాలదిన్నె వద్ద అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ముచ్చటగా మూడో సారి 2019 డిసెంబర్‌లో వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లె సమీ పంలో కన్యతీర్థం వద్ద శంకుస్థాపన చేశారు. ఆతర్వాత ఆయనే మళ్లీ నాల్గవ సారి ఈ ఏడాది ఫిబ్రవరి 15వ తేదీన ఉక్కు పరిశ్రమకు సున్నపురాళ్లపల్లె వద్ద భూమిపూజ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు చేసిందే కాని కేంద్ర ప్రభుత్వం మాత్రం ఆ ఊసే పట్టించుకోలేదు.

'ఉక్కు' పూర్తి చేయాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వ నిధులతో సెయిల్‌ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి. ఇందుకు సంబంధించి పార్లమెంటు సాక్షిగా ప్రజాప్రతినిధులు హామీలిచ్చారు. విభజన హామీని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకెళ్లి జిల్లాలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

- ఎం. మహేష్ గోపవరం కాలనీ, బద్వేల్

ఎన్నికల కోసమే..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కు పరిశ్రమను ఎన్నికల కోసమే ఉపయోగించుకుంటున్నాయి. నిరుద్యోగ యువతకు ఉపాధి చూపే చిత్తశుద్ధి ఇటు వైసిపికి కానీ, అటు కేంద్రంలోని బిజెపికి లేదు. ముఖ్యమంత్రి మాట నిలబెట్టుకోలేక తిరిగి జిల్లా ప్రజలను వంచిం చేందుకు జిందాల్ ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. ఇంతవరకు పనులు ప్రారంభించడం లేదు.

-వీరనాల శివ కుమార్ డివైఎఫ్‌ఐ వైఎస్ఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి

శిలాఫలకాలకే పరిమితం

ఉక్కు పరిశ్రమ నిర్మాణం సిఎం సొంత జిల్లాలో కేవలం శిలాఫలకాలకే పరిమితం కావడం దురదృష్టకరం. లక్షలాది మంది నిరుద్యోగుల్లో కనీసం వేలాది మందికైనా ఉపాధి లభిస్తుందని ఆశతో ఎంతోమంది నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ ఉక్కు పరిశ్రమపై చిన్నచూపు చేస్తున్నాయి. పరిశ్రమను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి చూపించాలి

-తోట శివశంకర్, నిరుద్యోగి, నందలూరు

ఉపాధి అవకాశాలకు గండి


రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ లో కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాల్సి ఉండగా పదేళ్ల గడుస్తున్నా అధికారంలో ఉన్న బిజెపి ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో నిరుద్యోగ యువత ఉపాధికి గండి పండింది. దీనివల్ల రాష్ట్రంలో చదువుకున్న యువత ఉపాధి కోసం బెంగళూరు, హైదరాబాద్, చెన్నైకి వలస వెళ్తున్నారు.

- ఎస్. ఖదీర్, నిరుద్యోగి కలికిరి.

మహిళా సాధికారతే లక్ష్యం : కలెక్టర్

ప్రజాశక్తి రాయచోటి

మహిళా సాధికారతే లక్ష్యంగా ఇబిసి నేస్తం పథకం ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం చేయూత నందిస్తోందని కలెక్టర్ గిరీష తెలిపారు. బుధవారం ప్రకాశం జిల్లా మార్కాపురం నుంచి వైయస్సార్ ఇబిసి నేస్తం పథకం కింద 45-60 సంవత్సరాల మధ్య వయసు ఉన్న అర్హులైన అగ్రవర్ణాలకు చెందిన అక్క చెల్లెమ్మలకు రెండవ విడత ఆర్థిక సాయాన్ని బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. కలెక్టరేట్లోని స్పందన హాల్లో వైయస్సార్ ఇబిసి నేస్తం పథకం ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి జమ చేసే వర్చువల్ కార్యక్రమాన్ని కలెక్టర్ గిరీష, డిఆర్‌ఓ సత్యనారాయణ, రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ వి.వెంకటేశ్వర్లు, బిసి సంక్షేమ శాఖ అధికారి సందప్ప, మహిళలు హాజరై వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమలతోపాటు ఇతర ఓసి సామాజిక వర్గాలకు చెందిన అర్హులైన పేద మహిళలకు వైయస్సార్ ఇబిసి నేస్తం పథకం ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహాయం అందుకున్న మహిళలు సొంత వ్యాపారాలు లేదా జీవనోపాధి మార్గాలను ఎంచుకొని వారి కాళ్ళ మీద వారు నిలబడేట్టుగా. ఎదగాలన్నారు. ప్రతి మహిళ ముఖంలో చిరునవ్వు, వారి కుటుంబంలో సంతోషం వెల్లివిరిసేందుకు అమ్మ ఒడి, కాపునేస్తం, చేయూత, సున్నావడ్డీ, ఆసరా, వసతి దీవెన, విద్యాదీవెన, విద్యా కానుక, జగనన్న తోడు, గోరుముద్ద, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ, మహిళలకు ఇళ్ల పట్టాల పంపిణీ తదితర పథకాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. మహిళల భద్రత కోసం దిశ యాప్, దిశ పోలీస్ స్టేషన్లు, గ్రామ వార్డు సచివాలయాలలో మహిళా పోలీసులను నియమించడం తో పాటు అనేక పథకాలను అమలు చేయడం జరిగిందన్నారు. మహిళలకు సాధికారత కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ప్రభుత్వ పథకాలను మహిళల సద్వినియోగపరచుకోవాలని పేర్కొన్నారు. కలెక్టర్, డిఆర్‌ఓ, మార్కెట్ కమిటీ చైర్మన్, బిసి సంక్షేమ శాఖ అధికారి తదితరులు వైయస్సార్ ఇబిసి నేస్తం రెండవ విడత లబ్ధి రూ.37.06 కోట్ల మెగా చెక్కును అర్హులైన మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, మార్కెట్ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



మహిళలకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ గిరీష

కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు డి.వెంకట్రామయ్య

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

గ్రామ పంచాయతీ, స్వచ్ఛభారత్ కార్మికులు, టైం స్కేల్ వర్కర్స్‌కు 5 నుండి 18 నెలలు పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని ఎపి గ్రామ పంచాయతీ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డి.వెంకట్రామయ్య అన్నారు. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ధరల పెరుగుదలకు అనుగుణంగా జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. టెండర్లు విషయంలో హైకోర్టు తీర్పు అమలు, సమానపనికి సమానవేతనం, ఉద్యోగాలు పర్మినెంట్ తదితర డిమాండ్ల పరిష్కారం కోసం గాంధీ జయంతి నుండి జరుప తలపెట్టిన నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రస్తుతం గ్రామీణ ప్రజానీకానికి నిరంతరం పారిశుధ్య సేవలందిస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు, స్వచ్ఛభారత్ కార్మికులు, టైం స్కేల్ వర్కర్స్ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఒకటిన్నర సంవత్సరం జీతం రాకపోతే జీవితం ఎలా గడపాలో అధికారుల, పాలకులు చెప్పాలన్నారు. ఇరవై సంవత్సరాల సర్వీస్ ఉన్ననూ ఇయస్ఐ ఫీఎఫ్ నోచుకోలేకున్నారని వెంటనే ఇఎస్ఐ. పిఎఫ్ అమలు చేయాలన్నారు. సంక్షేమ పథకాల అమలు చేయడంతో పాటు చనిపోయిన వారి మట్టి ఖర్చులకు రూ.25 వేలు, ప్రమాద బీమా రూ.పది లక్షలు ఇవ్వాలన్నారు. అకారణంగా జిల్లా వ్యాప్తంగా తొలగించిన ఆరుగురు కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోకపోతే జాతీయ ఎస్సి, ఎస్టి కమిషన్‌కు పిర్యాదు చేస్తామన్నారు. తక్షణం పెండింగ్ జీతాల విడుదలకు పోరాడతామ్మనారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు, ఎపి గ్రామ పంచాయతీ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి పందు సురేంద్ర, నాయకులు రెడ్డెయ్య, రవికుమార్, నాగరాజు, ప్రమీల, శ్యామల, ఇమ్రాన్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మికి వినతిపత్రం అందజేశారు.

ప్రభుత్వ ఉద్యోగులనూ గుర్తించండి : ఎపిజెఎసి

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వ ఉద్యోగులను కనీసం సామాన్యులుగా గుర్తించాలని ఎపిజెఎసి జిల్లా చైర్మన్ నరసింహకుమార్ పేర్కొన్నారు. బుధవారం తమ డిమాండ్లను సత్వరం పరిష్కరించాలంటూ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఉద్యమం తమ సమస్యల పరిష్కారానికై చేసే ఉద్యమమే తప్ప ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమం కాదని గుర్తుచేశారు. ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు సంబంధించిన పలు ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను పరిష్కరిస్తామని ఉద్యోగ సంఘాలకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నాడు చలో విజయవాడ కార్యక్రమాన్ని విరమించుకున్నామన్నారు. అనంతరం పలు కమిటీలను ఏర్పాటు చేసి ఉద్యోగ సంఘాలతో కలసి ప్రభుత్వ ఉద్యోగులక సమస్యల పరిష్కారానికి ఎపిజెఎసి ఆధ్వర్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న నేటికీ ప్రణాళిక బద్ధమైన పరిష్కారం లభించలేదన్నారు. ప్రభుత్వ, విశ్రాంత ఉద్యోగుల ప్రమోషన్లు, జిపిఎఫ్, పిఆర్‌సిలపై కానీ ఆర్టీసీ ఉద్యోగుల విలీనం అనంతరం వారు కోల్పోయిన హక్కుల పై కానీ, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు సంబంధించిన లైన్ డిపార్ట్మెంట్ సమస్యలపై కానీ ఇలాంటి పలు సమస్యలపై ప్రభుత్వాన్ని పలుమార్లు ప్రశ్నించినప్పటికీ ప్రభుత్వం దగ్గర ఎటువంటి స్పందన లేకపోవడంతో గత నెలలో తొలి దశ ఉద్యమాన్ని ప్రారంభించాంన్ననారు. ప్రభుత్వం సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించక పోవడంతో నేడు మలిదశ ఉద్యమాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు. ఉద్యోగులు జిపిఎఫ్ బిల్లులు సమర్పించి సంవత్సర కాలం గడుస్తున్న ఫలితం లేదని, 2021 నుండి నేటికీ డిఎలు పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేసిన ప్రభుత్వ ఉద్యోగులను కనీసం సామాన్య ప్రజలుగా గుర్తించి బట్టన్ నొక్కి సమయానికి ప్రజల ఖాతాలో డబ్బులు జమ చేసినట్టు ప్రభుత్వ ఉద్యోగుల కొరకు ఒక బట్టన్ నిక్కి వారి సమస్యలను సత్వరం పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ మల్లికార్జున, జిల్లా ట్రెజరర్ పిఎన్‌బి రెడ్డి, రాష్ట్ర ఎపిటిటిడి నాయకులు గాదన వెంకట నరసయ్య, ఎపి రెవెన్యూ అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జనార్దన్ రాజు, ఎపిఆర్ఎస్ఎ రాయచోటి డివిజన్ ప్రెసిడెంట్ రామాంజులు, సెక్రటరీ సురేష్, జిల్లా గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘ సెక్రటరీ ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న నరసింహకుమార్

అన్ని లేఅవుట్లలో నీటి సౌకర్యం

- అధికారుల సమీక్షలో కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

పేదల కోసం పెద్ద ఎత్తున నిర్మిస్తున్న ఇళ్లకు సంబంధించిన వైయస్సార్ జగనన్న కాలనీలలోని అన్ని లేఅవుట్‌లలో నీటి సరఫరా పనులు వేగవంతం చేసి నీటి సదుపాయం కల్పించాలని ఆర్‌డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్ అధికారులను కలెక్టర్ గిరీష ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి వైయస్సార్ జగనన్న కాలనీలలోని అన్ని లేఅవుట్లలో నీటి సరఫరా, విద్యుత్ కనెక్షన్ పెండింగ్ తదితర పనులు పురోగతిపై హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్, ఏపీఎస్పీడీసీఎల్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందరేగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణం వేగవంతం కోసం అన్ని లేఅవుట్‌లలో నీటి సరఫరా కచ్చితంగా ఉండాలని ఆదేశించారు. పీలేరు 14 లేఅవుట్‌లు, గుర్రంకొండ 2, కె.వి.పల్లి 6, తదితర మండలాల్లోని లేఅవుట్లలో నీటి సదుపాయం కల్పించాల్సి ఉందని, ఆ పనులు పెండింగ్ లేకుండా త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆయా లేఅవుట్లలో బోర్‌తో పాటు పైప్లైన్ కనెక్షన్ ఇవ్వాలన్నారు. వచ్చే బుధవారం కల్లా రాజంపేటలో నీటి సరఫరా పనులు పెండింగ్లో ఉండకూడదన్నారు. బోరుకు ఎలక్ట్రికల్ కనెక్షన్ పెండింగ్ లేకుండా త్వరగా చేయాలని ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఇని కలెక్టర్ ఆదేశించారు. కొత్త కాలనీలలో నీటి సరఫరా శాంక్షన్ చేసి పనులు త్వరగా ప్రారంభించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇని ఆదేశించారు. దాదాపు 18 వేల ఇల్లు నిర్మాణం పూర్తి అయ్యాయని, 5000 వేల ఇళ్లకు మాత్రమే విద్యుత్ కనెక్షన్ మీటర్ ఇచ్చారని, అడిగిన వాళ్లకు వెంటనే విద్యుత్ కనెక్షన్ మీటర్ ఇవ్వాలన్నారు. వచ్చే నెలలోగా రాష్ట్రంలో 5 లక్షల ఇల్లు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించాలని ఉన్నారని, ఆదిశగా అధికారులందరూ బాధ్యతగా ఇళ్ల నిర్మాణం వేగవంతం కోసం పనిచేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ పీడీ శివయ్య, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఇ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ ప్రసన్నకుమార్, పబ్లిక్ హెల్త్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వం అందించే సేవలను ప్రజలు సద్వినియం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మాధవరం-2 సచివాలయం పరిధిలో ఉన్న తమటంవారిపల్లెలో నిర్వహించుచున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సార్వత్రిక వ్యాధినిరోధక టీకాలు కార్యక్రమాన్ని కూడా పరిశీలించి సిబ్బంది రికార్డు చూసి తగు సూచనలు సలహాలు తెలిపారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గర్భిణులకు రక్తహీనత రాకుండా జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని, ప్రభుత్వం హాస్పటల్ నందే కాన్పుకు రావాలని తెలిపారు. బిపి, షుగర్ తదితర జబ్బులకు పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా మందులను ప్రభుత్వం ఉచితంగా ఇస్తారని తెలిపారు. ఆయన వైద్య ఆరోగ్య సిబ్బందికి ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నియమనిబంధనలు అనుసరించి సేవలు అందించాలని కోరారు.కార్యక్రమంలో యండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ దివ్యవాణి, ఎంపిహెచ్ఇఒ యం.వేణుగోపాల్‌రెడ్డి, హెల్త్ సూపర్వైజర్లు డి.వెంకటేశ్వరరెడ్డి, జి.రవణమ్మ, మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి,యం.యల్.హెచ్.పి లు కె.శిరోమణి, యస్.సహనాజ్, సచివాలయం ఎఎన్ఎంలు ఆర్.జయసుధ, ఎస్.గీతాంజలీ, అశాకార్యలు టి.రెడ్డిరాణి, బి.గంగదేవి, గీతా రాణి పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ సభ్యుల సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి రాజంపేట అర్బన్

ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ యూనివర్సిటీలో సస్పెండ్ అయిన ఐదుగురు ఎస్ఎఫ్ఐ సభ్యుల సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రమణ డిమాండ్ చేశారు. రమణ ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట విద్యార్థులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో 5 మంది ఎస్ఎఫ్ఐ కార్యకర్తలను అన్యాయంగా, ఏకపక్షంగా సస్పెండ్ చేయడాన్ని ఎస్ఎఫ్ఐ రాజంపేట పట్టణ కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు. పరీక్షల విభాగంలో యూనివర్సిటీ చేసిన అవకతవకలను ఎస్ఎఫ్ఐ బహిర్గతం చేసినందుకు ప్రతిస్పందిస్తూ సస్పెన్షన్ వేటు వేయడం సరికాదని పేర్కొన్నారు. యూనివర్శిటీ ఎస్ఎఫ్ఐపై అసత్య ఆరోపణలు చేస్తూ అసలు విషయాలను దాచిపెట్టే ప్రయత్నం చేస్తోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ నియంతృత్వాన్ని క్యాంపస్‌లోని విద్యార్థి లోకం సహించదని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం లోపల, వెలుపల సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కు విద్యార్థులకు ఉంటుందని తెలిపారు. విద్యార్థుల భావ ప్రకటనా స్వేచ్ఛను అరికట్టడానికి ఎవరికీ హక్కు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ విద్యార్థుల ప్రజాస్వామిక హక్కులను గౌరవించాలని తెలిపారు. వాటితో పాటు నిర్మాణాత్మక చర్చలు జరపాలన్నారు. సస్పెండ్ అయిన విద్యార్థులకు సంఘీభావంగా నిలబడాలని విద్యార్థులకు పిలుపునివ్వడం జరిగిందని, క్యాంపస్‌లలో అసమ్మతిని అణిచివేసే ప్రయత్నాన్ని ప్రతిఘటించాలని కోరారు. అన్ని అభ్యుదయ శక్తులను కలుపుకొని 5 మంది విద్యార్థుల సస్పెన్షన్‌ను తక్షణమే బేషరతుగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట వైసిపిలో అసమ్మతి సెగలు

మూకుమ్మడి రాజీనామాకు యత్నించిన కార్యకర్తలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట వైసిపిలో అసమ్మతి సెగలు రోజురోజుకూ పెచ్చుమీరుతున్నాయి. ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జునరెడ్డి వైఖరికి నిరసనగా బుధవారం వైసిపి కార్యకర్తలు పార్టీకి మూకుమ్మడి రాజీనామాకు సిద్ధపడ్డారు. పల్లె రఘుయాదవ్ ఆధ్వర్యంలో నారపురెడ్డిపల్లిలోని పాఠశాలలో అసమ్మతి కార్యకర్తలతో సభ ఏర్పాటు చేసి పార్టీ నుంచి రాజీనామాకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న వైసిపి నేత గాలివీటి మోహన్‌రెడ్డి హుటాహుటిన సభా ప్రాంగణానికి చేరుకుని అసమ్మతి నేతలను బుజ్జగించి రాజీనామాలను ఉపసంహరింపజేశారు. అసమ్మతి కార్యకర్తల సమస్యలను రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సహాయంతో పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చి వారిని బుజ్జగించడంతో సమస్య సర్దుమణిగింది. అనంతరం మదన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ అసమ్మతి కార్యకర్తల సమస్యలు పరిష్కరించి ఏకతాటి పైకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలియజేశారు. నియోజకవర్గంలో ఇద్దరు నాయకులు మధ్యన జరుగుతున్న కోల్డ్‌వార్ రోజురోజుకు తీవ్రమవుతుండడంతో నియోజకవర్గంలో పార్టీ ఉనికికే చేటు వాటిల్లే ప్రమాదం ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారని పేర్కొన్నారు. ఆది నుంచి ఇద్దరు నేతల అనుచరులు పరస్పరం కాళ్లు దువ్వుతూ అవకాశం దక్కినప్పుడల్లా ప్రత్యర్థి నాయకుడిపై బురద జల్లుతూ తమ ఆధిపత్యం చూపేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నారన్నారు. ఒకరి మీద ఒకరు భూ ఆక్రమణల ఆరోపణలు గతంలో నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారిందని తెలిపారు. మంగళవారం మేడా మల్లిఖార్జున్‌రెడ్డికి వ్యతిరేకంగా పోస్టర్లు, నేడు వైసిపి కార్యకర్తల మూకుమ్మడి రాజీనామాల వ్యవహారం నియోజకవర్గంలో పెద్ద చర్చనీయాంశంగా మారింది.

ఆర్థిక సంక్షోభం దిశగా ఆంధ్రప్రదేశ్ : ఆర్ఆర్

ప్రజాశక్తి-రాయచోటి

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోతుందని మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం సంబేపల్లి మండలంలోని దుద్యాల పంచాయతీ చిన్నకోడి వాండ్లపల్లె, రెడ్డివారిపల్లె, వడ్డేపల్లె, మహ్మద్ నగర్, హరిజనవాడ, కోటకాడపల్లె, మోపురంపల్లె, ఈడిగపల్లె, మాలపల్లె, పిచ్చిగుంటపల్లె, ఒదేటివాండ్లపల్లె, వడ్డెవాండ్లపల్లె, బయనపల్లె, కొత్తపల్లె, పూజరివాండ్లపల్లె లలో రాష్ట్రానికి ఇదేమి కర్మ, రచ్చబండ కార్యక్రమాలు తెలుగుదేశం పార్టీ శ్రేణులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బీసీ సబ్ ప్లాన్ నిధులను నవరత్నాల పేరిట దారి మళ్ళించడంతో వెనకబడిన కులాలకు వర్గాలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు నిలిచి పోయాయన్నారు కనీసం రోడ్ల మరమ్మతు కూడా లేక అన్ని రంగాలకు కష్టాలు పెరిగాయన్నారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో అప్పుల పాలు అయిందన్నారు. మరో 10 ఏళ్లు గడిచిన కోలుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు అభివృద్ధి పేద వర్గాలకు కాకుండా నాయకుల దోపిడీకి అభివృద్ధి పథకాలు అంకితం అయ్యాయన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో పేద ప్రజల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు రద్దు అనుభవానికి వీలుకాని ఇళ్ల స్థలాల పంపిణీ మట్టి ఇసుక దోపిడీల దందాలతో సామాన్య ప్రజల జీవితాల్లో అల్లకల్లోలంగా మార్చారని విమర్శించారు భూ కబ్జాలు భారీగా పెరిగిపోయేనన్నారు. కార్యక్రమంలో నాయకులు మదిరెడ్డి రమేష్‌రెడ్డి, జయరెడ్డి, చిన్న రెడ్డయ్య యాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, బాడేపల్లె రమణారెడ్డి, సాదు జయచంద్రరెడ్డి, రవినాయుడు, గోపీనాథ్‌రెడ్డి, సహదేవ, ఆంజనేయులు, మణికంఠ, శివప్రసాద్, సిద్దు, శీను, రఘుభాస్కర్‌రెడ్డి, శంకర, బాబురెడ్డి, శశిధర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, జనం ఆనంద, సుబ్బరాజు యాదవ్, నూరు ఎకరాల రంగారెడ్డి పాల్గొన్నారు.



షేక్ హమీదకు బహుమతిని ప్రదానం చేస్తున్న సయ్యద్ సర్దార్ హుస్సేన్

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని టి.కమ్మపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం హిందీ ఉపాధ్యాయుడు సయ్యద్ సర్దార్ హుస్సేన్ ఆధ్వర్యంలో హిందీ సుప్రసిద్ధ కవి మాఖన్‌లాల్ చతుర్వేది జయంతి సందర్భంగా 'దేశభక్తి హిందీ గీత్' ప్రతి యోగితా కార్యక్రమం నిర్వహించారు. ఈ పోటీలో విజేతలైన విద్యార్థులకు బహుమతులను ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే పిల్లలలో దేశభక్తి భావాలు పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు బాగా ఉపయోగపడతాయని అన్నారు. హిందీ దేశభక్తి గేయాలు మనసుకు బాగా హత్తుకుంటాయని తెలిపారు. సారే జహాసే అచ్చా, మా తుఝే సలాం, ఏ మేరే వతన్ కే లోగో, హింద్ దేశ్ కే నివాసి తదితర పాటలు దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గురవ్వ, శివప్రసాద్, ఆవుల వెంకట్ పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే సిఎం ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బి.కొత్తకోట



మహిళలకు ఆసరా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే

మహిళల ఆర్థికాభివృద్ధి చెందాలన్నదే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని నగర పంచాయతీలో నిర్వహించిన వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన చర్యలు, పథకాల అమలు కారణంగా పొదుపు సంఘాల ఆర్థికవృద్ధి పెరిగిందన్నారు. గత ప్రభుత్వ పాలనలో నిర్వీర్య దశలో ఉన్న పొదుపు సంఘాలను ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలు జీవం పోశాయన్నారు. ప్రభుత్వం మహిళ అభ్యున్నతికి, రక్షణకు, మహిళ ఆత్మగౌరవ వృద్ధికి ఎంతగానో పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు. మహిళలకు పదవుల్లో 50 శాతం రిజర్వేషన్లు, మహిళల రక్షణకు దిశ యాప్, మహిళల పేరుతో ఇళ్లస్థలాలు, పక్కాగృహాలు మంజూరు, పేదరిక నిర్మూలనకు ఆసరా, చేయూత, సున్నావడ్డీ పథకాల అమలుతో మహిళలకు మంచి జరుగుతోందన్నారు. మహిళా సాధికార విషయంలో నేడు ఇతర రాష్ట్రాలు సైతం ఏపి వైపు చూస్తు న్నాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శంకరయ్య, తహశీల్దార్ ధనుంజయులు, కమిషనర్ నరసింహప్రసాద్, నగర పంచాయతీ అకౌంట్ ఆఫీసర్ బి.రమాదేవి, విద్యుత్ శాఖ ఎఇ గిరిధర్, వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి అయూబ్ భాష, మాజీ కో-ఆప్షన్ మెంబర్ అమీర్‌సాబ్, సచివాలయం కన్వీనర్ ఎస్.ఎస్ ఫయాజ్, సిఆర్.చిన్నికృష్ణ, జీవి.రామకృష్ణ, ప్రభుత్వ ఆస్పత్రి కమిటీమెంబర్ నక్కామహేష్, షమీ, సోషల్ మీడియా మండల కన్వీనర్ పవన్ కుమార్, సంత సర్వీ, సద్దాం, సచివాలయాల మండలకన్వీనర్ రెడ్డిపాలి పాల్గొన్నారు.

'మార్కెట్ ఆధారిత విస్తరణ సేవలపై శిక్షణ'

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని ముడిదారిపల్లి రైతు భరోసా కేంద్రంలో కలికిరి కృషి విజ్ఞానకేంద్రం వారు మార్కెట్ ఆధారిత విస్తరణ సేవలపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న నెల్లూరు కెవికె శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.లోకేష్ బాబు మాట్లాడుతూ రైతులు ఇనామ్ ద్వారా తమ పంటను వేరే రాష్ట్రాల మార్కెట్ అమ్మకానికి పొందు పరిచే ప్రక్రియను వివరించారు. ప్రతి రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా మార్కెట్ చేసుకొని నికర ఆదాయాలను పొందవచ్చునని సూచించారు. రైతులు తమ పెట్టుబడుల తగ్గించడంలో భూసార పరీక్ష ప్రాముఖ్యతను తెలిపారు. శాస్త్రవేత్త డాక్టర్ వి.నవీన్ మాట్లాడుతూ పెరటి కోళ్ల పెంపకం ద్వారా రైతులు తమ ఆదాయాన్ని సుస్థిరం చేసుకోవడానికి దోహదపడుతుందన్నారు. వివిఎ రెడ్డికుమార్ ఖరీఫ్ సీజన్‌లో రైతులు చేపట్టవలసిన ఒంటిమడక, లోతు దుక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ముడిమారిపల్లి గ్రామ సర్పంచ్ బి.శాంతమ్మ, గ్రామ సచివాలయ సిబ్బంది, రెడ్డికుమార్, పీరు సాహెబ్, మాధురి పాల్గొన్నారు.

విరబూసిన బ్రహ్మకమలం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



బ్రహ్మకమలం చెట్టును చూపుతున్న మహిళ

పుష్పాలలో చాలా అరుదైనది బ్రహ్మ కమలం. ఇది ఈ పుష్పం ఏడాదికి ఒకసారి మాత్రమే విరబూస్తుంది. అందుకే దీన్ని ఎంతో అరుదుగా చూస్తారు. మండల పరిధిలోని కొండ మారిపల్లి పంచాయతీ టిఎన్ఆర్ కాలనీకి చెందిన మునయ్య ఇంటిలో బ్రహ్మకమలం వికసించింది. ఈ సందర్భంగా మునయ్య మాట్లాడుతూ తమ ఇంటిలో బ్రహ్మకమలం పూయడం చాలా ఆనందంగా ఉందన్నారు. సరిగ్గా రెండు సంవత్సరాలు కిందట తమ ఇంటి పెరట్లో ఈ మొక్క నాటామన్నారు. తాజాగా రాత్రి తొమ్మిది గంటల సమయంలో బ్రహ్మకమలం విరబూసిందని చెప్పారు.

టిడిపి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

నందలూరు : పట్టణంలోని స్థానిక షాదీఖానాలో బుధవారం టిడిపి ఆధ్వర్యంలో గొప్ప ఇఫ్తార్ విందును మండలంలోని ముస్లిం సోదరులకు ఏర్పాటు చేశారు. రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్రాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ విందుకు పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆర్‌టిసి రీజనల్ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు, మండల టిడిపి అధ్యక్షులు జంగం శెట్టి సుబ్బయ్య, నాయకులు గంటా గోపి, పసుపులేటి ప్రవీణ్ , శ్రీధర్ యాదవ్ బాబు, టంగుటూరు షర్మిల, మేస్త్రి వెంకటసుబ్బయ్య, ఆచారి, బి ఎన్ శంకర్, గణపతి, మోడపోతుల రాము, గొబ్బిళ్ళ సుబ్బరాయుడు, జ్యోతి శివ, పాటూరు రమేష్ పాల్గొన్నారు.

గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు

ప్రజాశక్తి-పీలేరు

గర్భస్థ దశలో స్త్రీలు అదనంగా ప్రత్యేక ఆరోగ్య పరీక్షలతో పాటు అధిక జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని డాక్టర్ రమేష్ రెడ్డి తెలియపారు. బుధవారం తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని గూడరేవుపల్లి ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా గర్భవతులకు ఆరోగ్య పరీక్షలు, సురక్షిత మాతృత్వంకై పలు సూచనలు, సలహాలిచ్చారు. గర్భిణులు పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేషన్ కొండయ్య పీహెచ్‌ఎన్ వెంకటసుబ్బమ్మ, ఏఎన్‌ఎం ఫామున్నిసా, వెంకటరత్నం, సిహెచ్‌ఓ లావణ్య, నాగసుధ, ఆశ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆంధ్రా ఊటీలో పెరిగిన ఉక్కపోత

రోజు రోజుకూ భానుడి ఉగ్రరూపం.. మూగ జీవాలు విలవిల

ప్రజాశక్తి-రామసముద్రం

ఆంధ్రా ఊటీ ప్రాంతంగా పేరున్న మదనపల్లి నియోజకవర్గంలో రోజు రోజుకూ భానుడి ఉగ్రరూపం దాల్చి భగభగమంటున్నాడు. పది రోజుల క్రితం వరకు చల్లటి గాలితో సేదతీరిన జనానికి ఇప్పుడిప్పుడే ఉక్కపోత మొదలవుతోంది. వారం రోజులుగా ఎండ తీవ్రత పెరుగుతూ వస్తోంది. అప్పుడే ఎండలు బాబోయ్ ఎండలు అంటున్నారు. ఏప్రిల్ రెండవ వారంలోనే ఎండ తీవ్రత ఇలా ఉంటే ఇక మే నెలలో భానుడి ప్రతాపం ఎలా ఉంటుందో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గత అయిదు రోజులుగా ఉష్ణోగ్రతలు 36 నుంచి 37 డిగ్రీలకు చేరుకున్నాయి. వేసవిలో తగిన జాగ్రత్తలు పాటించకపోతే వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఇక మండే ఎండలు రోజువారీ కూలీలపై భారీగా ప్రభావం చూపుతోంది. ఇక వీధి వ్యాపారులు, గొర్రెల కాపరులు, పశుపోషకులపై ప్రభావం చూపనుంది. ఆది, సోమవారాల్లో 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండ ధాటికి మధ్యాహ్నం ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. కొందరు ఎండవేడి నుంచి రక్షణ కోసం గొడుగులు, టవల్స్ అడ్డుపెట్టుకోగా మహిళలు చున్నీలను కప్పుకుని తిరుగుతుండడం కనిపించింది. ఎండలు పెరుగుతుండడంతో రైతన్నల పరిస్థితి వర్ణణాతీతంగా మారింది. నియోజకవర్గంలో ప్రధానంగా టమాటో, కాలిఫ్లవర్, కొత్తిమీర, బంతి పూలు ఇతర పంటలు సాగులో ఉన్నాయి. పొలాలకు నీరు అందించేకి పగటి పూట వెళ్లాల్సి వస్తుండటంతో ఎండ ధాటికి ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజులుగా పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. రాబోయే రోజుల్లో 40 డిగ్రీలు కూడా దాటే అవకాశాలున్నాయని నిపుణులు అంటున్నారు. వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. ఒక్కోసారి ప్రాణాలకు ముప్పు కూడా ఏర్పడుతుంది. ఇతర వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వేసవిలో చమట ఎక్కువ పడుతుంది కనుక సాధ్యమైనంత వరకు ప్రతి ఒక్కరూ నాలుగు నుంచి ఐదు లీటర్ల నీటిని తీసుకోవాలి. కూల్‌డ్రింక్‌కు బదులు మజ్జిగ, పండ్ల రసాలు తాగడం ఉత్తమం. ఎండ నుంచి ఇంటికి వచ్చిన వారు నిమ్మరసం తాగాలి. వేసవి ఉపశమనం కోసం కర్బూజ, దోసకాయలు, ఇతర పండ్లను తీసుకోవాలి. సాధ్యమైనంత వరకు నల్లటి దుస్తులు ధరించకుండా బాగా వదులుగా ఉండే దుస్తులను ధరించాలి. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి. అవసరమైతే తప్ప సాధ్యమైనంత వరకు ఇంటి పట్టునే ఉండడం మంచిది. తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సి వస్తే ఉదయం 11 గంటలలోపు పని ముగించుకుని ఇంటికి చేరాలి. బయటకు వెళ్లే వారు ఎండ నుంచి రక్షణ కోసం కూలింగ్ గ్లాసెస్, టోపి, హెల్మెట్, గ్లౌజ్‌లు వాడాలి. బయటకు వెళ్లే ముందు సన్ స్క్రీన్ లోషన్ రాసుకోవాలి. మసాలాతో కూడిన ఆహారానికి సాధ్యమైనంత వరకు దూరంగా ఉంటే మంచిది. జంక్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్స్ జోలికి వెళ్లకుండా సంగటి, అంబలి తీసుకోవడం ద్వారా ఆరోగ్యానికి ఎంతో మేలు చేసినవారమవుతాం. జొన్నలు, రాగులతో చేసిన అంబలి లేదా సంగటిని తీసుకోవడం ద్వారా డీహైడ్రేషన్‌ను దూరం చేసుకోవచ్చు. శరీరాన్ని వేసవి తాపం నుంచి దూరం చేసుకోవాలంటే సజ్జలు, జొన్నలు, రాగులతో చేసిన వంటకాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిందే. ఎండాకాలం రాగి జావ రోజూ ఒక కప్పు తీసుకోవడం వల్ల డీహైడ్రేషన్‌కు చెక్ పెట్టవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.



మండుటెండల్లో పశువుల కాపరి



గొర్రెలను మేతకు తీసుకెళుతున్న పశువుల కాపరి

సంక్షేమ పాలన వైసిపితోనే సాధ్యం

ప్రజాశక్తి-పుల్లంపేట



గడప గడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే

మండల పరిధిలోని పుల్లంపేట గ్రామం నందు బుధవారం సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే - జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సంక్షేమ పాలన వైసిపితోనే సాధ్యమని అన్నారు. ప్రతి గృహ సారథి కన్వీనర్ కార్యకర్త అట్టహాసంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి గడపకు అందాయా లేదా, ప్రజలు ప్రభుత్వంపై ఏవిధంగా స్పందిస్తున్నారో తెలుసుకోవాలని అన్నారు. ప్రతి గడపగడపకు వెళ్లి ప్రభుత్వం ముద్రించిన స్టిక్కర్‌ను అతికించి 82960 82960 నెంబర్ కి మిస్డ్ కాల్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. 2024 సంవత్సరంలో జగనన్న భారీ మెజారిటీతో గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్నాడని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనియర్లు బోగా పార్థసారథి, బి.కె మణి, వైసిపి నాయకులు మడగలం శీను, కార్యకర్తలు, గృహ సారథులు పాల్గొన్నారు. **కలకడ:** ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం బాటవారిపల్లి, నీలప్ప గారిపల్లి , కూచి వారిపల్లి గ్రామాలలో కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఒక్కరూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి శ్రీదేవి రవికుమార్ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **కలకడ :** ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలనతోనే ప్రజలు సుభిక్షంగా ఉన్నారని మండల సచివాలయ కన్వీనర్ మోహన్ రాజానాయుడు పేర్కొన్నారు. మండలంలోని ఏనుగొండపాలెం పంచాయతీ లోని గ్రామాలలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు పాల్గొన్నారు. **వీరబల్లి :** మండలంలోని మట్లి పంచాయతీ తొగటపల్లిలో జిల్లా బిసి సెల్ అధ్యక్షులు మోడం నాగభూషణ ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో గుండ్లపల్లి శైలజ, వాలంటీర్లు, గృహసారథులు ప్రజలు పాల్గొన్నారు. **పీలేరు:** స్థానిక జెకె నగర్‌లో జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు షఫీ ఆధ్వర్యంలో వైసిపి కార్యకర్తలు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించుకుని మరోమారు ముఖ్యమంత్రిని చేద్దామని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మునీర్, మల్లికార్జున, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్ల నిర్వహణ పటిష్టంగా ఉండాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నాలుగవ విడత జగనన్న విద్యా కానుకకు సంబంధించి మండల్ స్టాక్ పాయింట్ల నిర్వహణ పటిష్టంగా నిర్వహించాలని సమగ్ర శిక్షా జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి జి.కరుణాకర్ మండల బృందానికి సూచించారు. బుధవారం ఆయన స్థానిక ప్రాథమిక పాఠశాలలో ప్రతిపాదించిన మండల్ స్టాక్ పాయింట్ ను పరిశీలించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ జూన్ 12 వ తేదీ పాఠశాల తెరిచే నాటికే విద్యార్థులందరికి జగనన్న విద్యా కానుక కిట్ అందించాలనే దృఢ నిశ్చయముతో ప్రభుత్వం ఉందన్నారు. స్టాక్ పాయింట్ లో వస్తువుల భద్రత మరియు అందుబాటులో సదుపాయాలను పరిశీలించినట్లు తెలిపారు. జగనన్న విద్యా కానుక పంపిణీకి సంబంధించి మండల చైర్మన్‌గా ఎంఇఒ, కన్వీనర్‌గా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సభ్యులుగా ఎంఐఎస్ కో-ఆర్డినేటర్, కంప్యూటర్ ఆపరేటర్, సిఆర్‌పిలు వ్యవహరిస్తారన్నారు. నిమ్మనపల్లె ప్రాథమిక పాఠశాలలోని స్టాక్ పాయింట్ పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమములో ఎంఇఒ టి.రాజగోపాల్, ఎపిఎం రజనికుమారి, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ నరసింహులు, పిఆర్‌పిలుసుధాకర, మంజుల, పద్మనాభం, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

పట్టణంలోని శ్రీ సాయి డిగ్రీ కళాశాలలో శుక్రవారము జాబ్ మేళా నిర్వహించనున్నట్లు బైజూస్ సంస్థ ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్లేస్మెంట్ ఆఫీసర్ పి. వెంకట ప్రసాద్ కళాశాల ప్రిన్సిపల్ ముత్యాల పెంచలయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగాల కొరకై మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో జాబ్ మేళా జరుగుతుందని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు పేర్కొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-రామాపురం

సచివాలయాలకు వచ్చే ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగులకు గ్రామవార్డు సచివాలయ జిల్లా అధికారి మనోహర్ రాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాలకు వచ్చే ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ వేసి ఉండాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి సచివాలయంలోనూ ప్రజల నుంచి సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. సచివాలయాలకు ప్రజలు ఎండకు వస్తే వారికి నీటి దాహం తీర్చలన్నారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారం కాకపోతే మండల స్థాయి అధికారులకు తెలియజేయాలని సిబ్బందికి సూచించారు. సెలవుపై వెళ్లేటప్పుడు పంచాయతీ సెక్రెటరీ తెలపాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ హైదర్‌వలి, ఇఒపిఆర్‌డి ఉషారాణి, ఎఒ శివశంకర్. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరకీ సంక్షేమ పథకాలు :'గడికోట'

ప్రజాశక్తి-చిన్నమండెం

అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం చిన్నమండెం మండలం దేవగుడిపల్లె గ్రామంలోని రాజీవ్ కాలనీ, హరిజనవాడ, జల్లావాండ్లపల్లె, కొండమూలలలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వంలో జడ్‌పి మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డితో కలసి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఇంటిటికెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలును వివరిస్తూ, ప్రజా సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సర్పంచ్ అమృతమ్మ, ఎంపిటిసి రమణ, బాబు రెడ్డి, భాస్కర్ రెడ్డి, జయశంకర్ రెడ్డి,రఘునాథ రెడ్డి,చంద్ర, రాజా, కృష్ణారెడ్డి, నీరంజన్‌రెడ్డి, రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, మండల ఉపాధ్యక్షుడు ఎజాస్ అలీ ఖాన్, సర్పంచ్ నజీర్ అహమ్మద్, గోపి, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

వేసవి,అధిక ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని మండల ప్రజలు,విద్యార్థులు తగిన జాగ్రత్తలు పాటించాలని తహశీల్దార్ ధనుంజయులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో పాఠశాలలకు నాలుగు రోజులు సెలవులు ప్రకటించినట్లు తెలిపారు. ముఖ్యంగా బయటికి వెళ్లేటప్పుడు నెత్తికి టోపి పెట్టుకోడం లేదా రుమాలు కట్టుకోవడం, తెలుపురంగు గల కాటన్ వస్త్రాలను ధరించడం,కళ్ల రక్షణ కోసం సన్ గ్లాసెస్ ఉపయోగించాలన్నారు. తరుచుగా నీటిని తాగడం,ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజు, ఒఆర్ఎస్ కలిపిన నీటిని తాగాలని సూచించారు. వడదెబ్బకు గురైన వారు సాధారణ స్థితికి రానిచో,దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలన్నారు. తీవ్రమైన ఎండలో బయటికి వచ్చినప్పుడు తలతిరుగుట, వాంతులు ఇతర అనారోగ్య సమస్యలు ఏర్పడితే వెంటనే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలన్నారు. తీవ్రమైన ఎండలో బయటికి వచ్చినప్పుడు తలతిరుగుట, వాంతులు ఇతర అనారోగ్య సమస్యలు ఏర్పడితే వెంటనే దగ్గరలోని వైద్యుడిని సంప్రదించాలన్నారు. అదేవిధంగా రద్దీగా ఉండే ప్రదేశాలలో కోవిడ్ నిబంధనలు పాటించాలని సూచించారు.

విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని పాథమికోన్నత పాఠశాలలో ఆరవ తరగతి విద్యార్థులు ఏడవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఉన్నత చదువులు చదివి అగ్రస్థానాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి, భోగా పార్థసారథి ప్రధానోపాధ్యా యులు భారతి, ఉపాధ్యాయులు గోవిందమ్మ, సంగీత, శ్రీవాణి, సునీత, చంద్రశేఖర్, ప్రసాదరావు, చిన్న మణమ్మ, లక్ష్మీదేవి, జయ రామకృష్ణయ్య, ఉషారాణి, అశోక్, ఎంఆర్‌పి శివ, విద్యార్థులు పాల్గొన్నారు.

సుండుపల్లిలో ఘనంగా స్కూల్ డే

సుండుపల్లి : చిన్నతనం నుండి విద్యపై విద్యార్థిని విద్యార్థులకు ఆసక్తిని పెంపొందించేలా తల్లిదండ్రులు బాధ్యత వహించాలని మాజీ జడ్‌పిటిసి జయమ్మ, ఎంపిపి అజంతమ్మ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ది హరిజన్ స్కూల్లో స్కూల్‌డే ను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సింగిల్ విండో ప్రెసిడెంట్ రామకృష్ణారెడ్డి, విశ్రాంత అధ్యాపకుడు, ప్రిన్సిపల్ సుబ్బరాజు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శైలజ, ఉపాధ్యాయులు రెడ్డిశేఖర్‌రెడ్డి, వ్యాయామ అధ్యాపకుడు నాగార్జున పాల్గొన్నారు.

నవ్వులు పూయించిన జబర్దస్త్ కళాకారులు

ప్రజాశక్తి-పీలేరు

పట్టణంలోని ఎంజెఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో బుల్లితెర నటులు నవ్వులు రువ్వించారు. బుధవారం స్థానిక చిత్తూరు రోడ్డులోని ఇంజినీరింగ్ కళాశాలలో జబర్దస్త్ కళాకారులు సందడి చేశారు. జనిత్ -2కె 24, జాతీయ స్థాయి టెక్నికల్ సింపోజియం ఈవెంట్లో భాగంగా జబర్దస్త్ టీం పాల్గొని విద్యార్థులను నవ్వుల్లో ముంచెత్తారు. జబర్దస్త్ టీంలోని ఆటో రాంప్రసాద్, ఇమ్మానుయేల్, లేడీ గెటప్ తన్మయి, బాబు తదితరులు పాల్గొని విద్యార్థులను తమ మాటల గారడితో ఉత్సాహ పరిచారు. కామెడీ స్కిట్లు ప్రదర్శించి అందరినీ అలరించారు. ఆటో రాంప్రసాద్, ఇమ్మానుయేల్ పంచులకు అందరూ పగలబడి నవ్వారు. కళాశాల ప్రాంగణం విద్యార్థుల కేరింతలతో దద్దరిల్లింది. కార్యక్రమం మధ్యలో కళాశాల సహకారంతో తిరుపతి కొర్లకుంటకు చెందిన కళ్యాణ్ దర్శకత్వంలో నిర్మించిన ఇండిపెండెంట్ షార్ట్ ఫిల్మ్ "నీతో నా పరిచయం" పోస్టరును జబర్దస్త్ టీం ఆవిష్కరించింది. కార్యక్రమంలో ఎంజెఆర్ కళాశాల చైర్మన్ ఎంపి అవినాష్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. సుధాకర్ రెడ్డి, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ద్వారకనాథరెడ్డి, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ

లక్కిరెడ్డిపల్లి : క్షయ వ్యాధిగ్రస్తులను వెలివేయకుండా ఆదుకోవాలని కేవలంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ రియాజ్‌బేగ్ పేర్కొన్నారు . క్షయ వ్యాధి నిశ్చయ పోషణ ఆహార కార్యక్రమంలో భాగంగా బుధవారం క్షయ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ ఫుడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఏ గ్రామంలోనైనా క్షయ వ్యాధిగ్రస్తులు ఉంటే వారికి నెలసరి సరిపోవు పోషకాహార పదార్థాలను అలాగే ఉచితంగా మందులను అందజేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధిగ్రస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలో పదిమంది క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి వైద్య సిబ్బంది దత్తత తీసుకున్నారని ఎవరైనా ఉంటే ఆస్పత్రిని సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రఫీ ఫుల్ కాల్ ఎంపిహెచ్ఇఒ దేవదానం, క్షయవ్యాధి సూపర్వైజర్ హరి, స్టాఫ్‌నర్స్ సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

భూ కబ్జాదారులకు అడ్డుకట్ట వేయాలి

ప్రజాశక్తి-కలకడ

భూ కబ్జాదారులకు అడ్డుకట్ట వేయాలని స్థానిక తహశీల్దార్ రాముకు కలకడ గ్రామస్తులు బుధవారం వినతిపత్రం సమర్పించారు. మండల కేంద్రమైన కలకడలో భూ సర్వే నెంబర్లు 163, 164లో అయిదు ఎకరాల భూమి తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాలను నిర్మించేందుకు అప్పటి గ్రామ పెద్దలు దండు అబ్దుల్ కరీం, మహమూద్, అబ్దుల్ రహీం, మొహిద్దిన్, మహబూబ్ సాబ్‌లు రూ.1.37 లక్షలకు 1989 సంవత్సరంలో విక్రయించినట్లు తెలిపారు. అనివార్య కారణాల వల్ల రిజిస్ట్రేషన్ చేసుకోలేక పోయారు కానీ, శాశ్విత అగ్రిమెంట్ భూమి గల వారు వలి ఖాన్, రసూల్ ఖాన్ , నవాజ్ ఖాన్ ,హుసేన్ ఖాన్ ,ఖాదర్ ఖాన్, బీబీజాన్ సాస్విత అగ్రిమెంట్ చేసుకున్నారు. ఇప్పుడు ఎవరికి తెలియ కుండా వీరి వారసులు అహ్మద్ అలీ ఖాన్, ఇలియాజ్ అలీఖాన్, బీబీజాన్, సర్దార్ ఖాన్‌లు వన్ బి, పాస్‌బుక్ లు తయారు చేసుకున్నారని చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న మసీదు పెద్దలు, గ్రామ పెద్దలు తహశీల్దార్‌ను కలసి మా దగ్గర ఉన్న డాక్యుమెంట్స్ చూపించి, ఈ భూమి పై ఎవరికి ఎలాంటి పాస్‌బుక్ మంజూరు చేయవద్దని అర్జీ ఇచ్చినట్లు తెలిపారు. తాహశీల్దార్ మాట్లాడుతూ మీరు ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించి వివరాలను ఆర్‌డిఒ, సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు.

ఆంగ్ల భాషపై యువత ప్రావీణ్యం పెంచుకోవాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రస్తుతం ప్రభుత్వ, ప్రయివేట్ ఉద్యోగాల సాధనలో ఆంగ్ల బాషపై పట్టు సాధించడం ఎంతో కీలకంగా మారిందని ఎమ్మెల్యే నవాజ్ బాషా అన్నారు. బుధవారం పట్టణంలోని కో-ఆపరేటివ్ సొసైటీ కాలనీ రింగ్‌రోడ్డులో బుధవారం రాజుస్ కమ్యూనికేటివ్ ఇంగ్లీష్ సెంటర్‌ను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ విద్యార్థులు ఉద్యోగాలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు అందుబాటులోకి రాజుస్ కమ్యూనికేటివ్ ఇంగ్లీష్ సెంటర్ రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుత సమాజంలో మాతృబాషాతో పాటు ఇంగ్లీష్ అవసరం ఎంత గానో పెరిగిందని, ఇంగ్లీషులో మంచి పరిజ్ఞానం కలిగిన వారికి ప్రపంచంలో ఎక్కడైనా రాణించగలరని అన్నారు. పెద్దపెద్ద నగరాలలో ఇటువంటి కమ్యూనికేటివ్ సెంటర్లు అందుబాటులో ఉన్నాయని, ప్రస్తుతం మదనపల్లిలో అలాంటి సెంటరును ఏర్పాటు చేస్తున్న వింగ్ కమాండర్ రాజు ఆశీర్వాదం, క్రిస్టిఫర్‌శామ్యూల్, డాక్టర్ పద్మిని ఆనంద్‌లను అభినందించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పాల్‌చంద్ర శేఖర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తట్టి శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ శోభనవీన్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చెరువులో వృద్ధురాలి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



వృద్ధురాలి మృతుదేహం

మదనపల్లె మండలం తట్టివారిపల్లె చెరువులో గుర్తు తెలియని వృద్ధ మహిళ మృతదేహం కలకలం రేపింది. నీటిలో మృతదేహం తేలాడుతుండడాన్ని స్థానికులు బుధవారం మధ్యాహ్నం గుర్తించారు. ఆత్మహత్య చేసుకుని మృతి చెందిందా లేక ఎవరైనా కొట్టి చంపి నీళ్లలో పడేశారా అన్నది తెలియాల్సి ఉంది. స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికితీసి శవపరీక్ష నిమిత్తం స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. మరిన్ని వివరాలు పోలీస్ దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

వ్యక్తి ఆత్మహత్యకు కారణమైన నిందితుడి అరెస్టు

ప్రజాశక్తి-ములకలచెరువు

ఓ వ్యక్తి ఆత్మహత్యకు కారణమైన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ములకలచెరువు ఎస్ఐ డి వై.స్వామి తెలిపారు. స్థానిక ఉమాశంకరా కాలనీకి చెందిన .ఎస్. ఆక్బర్బషా (36) గత నెల 26న ఇంటిలో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన విధితమే అక్బర్‌బాషా తండ్రి బాషా ఫిర్యాదు మేరకు ములకలచెరువు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల కథనం మేరకు.. అక్బర్‌బాషా స్థానికంగా ఉన్న ఓ బేకరిలో పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరి ఇంటికి సమీపంలో ఉన్న వినోద్ కుమార్ అనే వ్యక్తి అక్బర్‌బాషా భార్యతో కొంత కాలంగా చనువుగా ఉంటూ వివాహేతర సంబంధం ఏర్పడుచుకున్నట్లు తెలిపారు. గత నెల 23న హుస్సేన్‌బీ వినోద్ కుమార్‌లు మాట్లాడుకుంటున్న సంఘటన చూసి మందలించాడు. ఈ విషయం తెలుసుకున్న వినోద్‌కుమార్ అక్బర్ బాషాతో గొడవపడ్డాడు. వినోద్ దురుసుగా మాట్లాడడంతో తన చావుకు కారణం వినోద్ అంటూ సామాజిక మాధ్యమాల్లో వీడియో పోస్టు చేసి ఆత్మహత్య చేసుక్నునట్లు పేర్కొన్నారు. ఈ కేసులో నిందితుడైన వినోద్ కుమార్ బుధవారం 10గంటల సమయంలో స్థానిక సబ్‌స్టేషన్ వద్ద ఉన్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ డివైస్వామి తమ సిబ్బందితో కలిసి అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ గాంధీనగర్ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు నందలూరు ఇన్‌ఛార్జి ఎస్ఐ భక్తవత్సలం పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఆయన మాట్లాడుతూ తమకు రాబడిన రహస్య సమాచారం మేరకు చిట్వేల్ కు చెందిన నెల్లోపల్లి హరి, జెట్టి శివయ్యలు గ్రామంలోని ప్రజల నుండి 366 కేజీల రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి బొలెరో వాహనంలో తరలిస్తుండగా ఏఎస్ఐ శంకర్ నాయక్, హెడ్ కానిస్టేబుల్ సుబ్బరాయుడు, పోలీసులు ప్రసాద్, రామకృష్ణ దాడులు నిర్వహించి వాహనంతో సహా బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడిపై ఫోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ఓ బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, గర్భవతిని చేసి మోసగించిన యువకుడు పై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు నిమ్మనపల్లి ఇన్‌ఛార్జి ఎస్ఐ సుధాకర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని వెంగంవారిపల్లి పంచాయతీకి చెందిన బాలిక ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేసి ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటుంది. అయితే ఇదే పంచాయతీ సఖిబండవారి పల్లెకు చెందిన గోవిందప్పగారి చంద్రయ్య కుమారుడు గోవిందప్పగారి నారాయణ (32) బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, కొంతకాలంగా ఆమెతో సన్నిహితంగా ఉంటూ గర్భవతిని చేశాడన్నారు. ఈ విషయం బయటకు చెబితే చంపుతానని బెదిరించినట్లు తెలిపారు. జరిగిన విషయం బాధితురాలు తల్లిదండ్రులకు తెలపడంతో బుధవారం బాలిక తల్లి స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. స్థానిక తహశీల్దార్ సి.ఆర్ మంజుల, ఎంపిడిఒ లీలా మాధవి, సిడిపిఒ సుజాత, స్థానిక పిహెచ్‌సి డాక్టర్ భాను ప్రకాష్, బాధితురాలు బాలిక ఇంటికి వెళ్లి మాట్లాడారు. బాలిక నుంచి వివరాలను సేకరించారు. బాలికను, యువకుడిని పోలీసులకు అప్పగించారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.